## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 7: ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగాలు ఉన్నాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం http://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

## రేపు జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 7: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువత కోసం ఈ నెల 9న ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డీఆర్డీవో జ్యోతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మ్యాక్స్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీలో పని చేసేందుకు బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 100 ఖాళీలను భర్తీ చేసేందుకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాలు ఉండాలన్నారు. వేతనం నెలకు రూ.14 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత ధ్రు వీకరణ పత్రాలతో పాటు జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 9న నిర్వహించే జాబ్‌మేళాకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దర్జాగా మొరం అక్రమ దందా

- రాత్రీపగలు తేడాలేకుండా తవ్వకాలు
- కనుమరుగవుతున్న గుట్టలు

మునిపల్లి, జూలై 7 : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో అక్రమ మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమార్కుల దాటికి కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. మొరానికి మార్కెట్లో డిమాండ్ ఉండడంతో రాత్రీపగలు తేడాలేకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ముంబయి జాతీయ రహదారి నుంచి వెళ్లేవారు బుధేరా–కంకోల్ గ్రామ శివారుల్లోని గుట్టలను చూసి సంతోషంతో ఫొటోలు దిగేవారు. నేడు ఆ అందమైన గుట్టలు మాయమవుతున్నాయి. అడ్డూ అదుపులేకుండా సాగుతున్న మొరం దందాపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బుధేరా గ్రామశివారులో ఎప్పుడూ పచ్చని అటవీ సంపదతో కళకళలాడే గుట్టలు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. మునిపల్లి మండలం బుధేరా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని గుట్టల నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లు, గ్రామీణ ప్రాంత రోడ్లు, ఇండ్ల నిర్మాణం కోసం మొరానికి డిమాండ్ బాగా ఉంది. దీంతో బుధేరా, కంకోల్, లింగంపల్లి, మొగ్దుంపల్లి గ్రామాల్లోని గుట్టలను కొందరు అక్రమంగా తవ్వేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అసైన్డ్ భూముల్లో సైతం మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది టిప్పర్లతో మొరాన్ని తరలిస్తూ దర్జాగా దందా సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతి వనరులను కాపాడాలని ప్రజలు కోరతున్నారు.


మునిపల్లి మండలం బుధేరా గ్రామ శివారులో మట్టిని టిప్పర్‌లో నింపుతున్న దృశ్యం

### మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

మండలంలో మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు మాదృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. తవ్వకాలకు మేమే ఎలాంటి అనుమతులు ఎవ్వరికి ఇవ్వలేదు.అలాంటి వారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. పది రోజుల క్రితం మునిపల్లి మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు వాహనాలను సీజ్‌చేసి జరిమానాలు విధించాం. మండలంలో ఎక్కడ మొరం తవ్వకాలు జరిపినా, మండలం నుంచి ఇతర మండలాలకు తరలిస్తే రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

*-తేన్‌మోళి, మునిపల్లి తహసీల్దార్*


మునిపల్లి గ్రామ శివారులో మట్టిని తరలించేందుకు వెళ్తున్న టిప్పర్


మామిడ్గిలో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీటిని పారబోస్తున్న అధికారులు


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి ప్రవీణ్‌కుమార్

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- వానకాలంలో డెంగీ, మలేరియా, డయేరియా సోకే ప్రమాదం
- అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

న్యాల్‌కల్, జూన్ 22: వానకాలంలో సోకే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా రోగాల బారిన పడక తప్పదు. ఇంటి పరిసరాల్లోని పెంటకుప్పలు, చెత్తాచెదారం, మురికాల్వలు, గుంతల్లో ఎక్కడ పడితే అక్కడ వర్షపు నీరు నిలుస్తుంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు, సూక్ష్మక్రిములు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులకు కారకాలుగా మారుతుంటాయి. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వచ్చే కాలమిది. వనకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జలుబు, డయేరియా, డెంగీ, మలేరియా, మెదడువాపు, చికున్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దోమల నుంచి రక్షణకు దోమతెరలు వాడాలని, ఏమైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో వృథా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పెంటకుప్పలు, చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేసుకోవాలి. ఇంటిలోని అన్ని గదుల్లో దోమల మందును పిచికారీ చేసుకోవాలి. వారంలో ఒక రోజు డ్రైడే పాటించి శుభ్రంగా ఉంచుకోవాలి. ఇండ్లలో ఉండే నీళ్ల ట్యాంకులపై సరైన మూతలు అమర్చాలి. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కూలర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూల కుండీల్లో నీటిని తరచూ మారుస్తూ ఉండాలి. కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. డెంగీ, మలేరియా కారక దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి. నీరు నిల్వ ఉంటే అందులో కిరోసిన్, పురుగు మందుగానీ కలపాలి. శరీరం మొత్తం కప్పేలా ఉన్న దుస్తులు ధరించాలి. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు చేసు

### అప్రమత్తంగా ఉండాలి



వానకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో నీరు ని ల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సాయంత్రం ఇంటి తలుపులు, కిటికీలు మూయాలి. క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి. నీళ్లుకాచి వడగట్టి తాగితే మంచిది. నీటి గుంటల్లో ఆయిల్స్ బాల్స్ వేయాలి, లేదా పది లీటర్లలో 5 ఎంఎల్ టెమీఫాస్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఇలా చేస్తే దోమలు లార్వా దశలోనే చనిపోతాయి. కూరగాయలు, మాంసం శుభ్రంగా కడిగిన తర్వాతే వండాలి. పూర్తిగా ఉడికిన తర్వాతే తినాలి. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. వ్యాధులు సోకితే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, దవాఖానాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసుకోవాలి.

*- గణపతిరావు, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, న్యాల్‌కల్*

# వైభవంగా జగన్నాథ రథయాత్ర


సంగారెడ్డిలో కొనసాగుతున్న జగన్నాథ రథ యాత్ర

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 7: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ప్రచార కేంద్రం, భక్తి యోగా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. కొత్త బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ఈ యాత్ర కొనసాగింది. భక్తుల కోలాటాలు, భజనలతో రథం ముందుకు సాగింది. రథయాత్రలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, ఇస్కాన్ ప్రతినిధి శ్రీమాన్ ప్రేమ్ నర్తన్ పాల్గొన్నారు.

**ఇస్నాపూర్‌లో..**

పటాన్‌చెరు, జూలై 7: ఇస్నాపూర్‌లో నిర్మించిన పూరి జగన్నాథ ఆలయంలో జగన్నాథ రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు హాజరవడంతో జగన్నాథుడి రథయాత్ర కిక్కిరిసిపోయింది. ఒడిశా, అస్సాం, తెలుగు రాష్ట్రాల భక్తులు హాజరై జగన్నాథుడి రథాన్ని లాగారు.

**తెల్లాపూర్‌లో..**

రామచంద్రాపురం, జూలై 7: తెల్లాపూర్‌లోని మైహోం అంకుర విలాస్‌లో ఆదివారం పూరి జగన్నాథ రథయాత్రను నిర్వహించారు. కాలనీలో సుమప్రమిణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి కీర్తనలు, భజనలు చేసుకుంటూ రథయాత్రలో పాల్గొన్నారు. కాలనీవాసులు అందరూ కలిసి సామివారి రథాన్ని లాగారు. పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీధర్, కాలనీవాసులు దినేశ్, గణేశ్, నాగేశ్, రామనారాయణ, కార్తీక్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘన సన్మానం


నారాయణఖేడ్, జూలై 7: ఎంపీపీ, జడ్పీటీసీల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని ర్యాకల్ గ్రామస్తులు మాజీ ఎంపీపీ చాందిబాయి చౌహాన్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్‌లను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ ఎంపీపీ, జడ్పీటీసీలుగా ర్యాకల్ ఉమ్మడి పంచాయతీకి చెందిన వారే ఎన్నికై సమర్థవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేయడం గర్వంగా ఉందన్నారు.


మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎంపీపీలను సన్మానిస్తున్న ర్యాకల్ గ్రామస్తులు

## జర్నలిస్ట్‌పై దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

గుమ్మడిదల, జూలై 7: తమ కాలనీలో మెయింటనెన్స్ చార్జీలు పెంచొద్దంటూ అన్నారం ప్రకృతి నివాస్ కాలనీవాసులు ఆదివారం జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ వార్తను చిత్రీకరిస్తున్న ఓ పత్రికా జర్నలిస్ట్‌పై కాలనీ కమిటీ సభ్యుడు దుర్భాషలాడి దాడికి యత్నించడంతో జర్నలిస్ట్ సంఘాలు ఠాణాలో ఫిర్యాదు చేశాయి. ప్రకృతి నివాస్ కాలనీవాసులు అధిక మెయింటనెన్స్ చార్జీలను నిరసిస్తూ ఆందోళ చేస్తున్న సమయంలో జనంసాక్షి జర్నలిస్ట్ కావలి ఐలేశ్ వీడియో చిత్రీకరిస్తున్న సమయంలో కాలనీ కమిటీ సభ్యుడు గోపాల్‌రెడ్డి జర్నలిస్ట్‌ను ఇష్టానుసారంగా దుర్భాషలాడి దాడికి యత్నించాడు. కాగా, కాలనీ జనం జర్నలిస్ట్‌కు అండగా నిలిచారు. విషయం తెలుసుకున్న జర్నలిస్ట్ సంఘాల అధ్యక్షుడు రవీందర్‌చారి, సత్యం, భానుచందర్, రాజు గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. జర్నలిస్ట్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎమ్మెల్యేకు వీఆర్వోల వినతి


ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోల జేఏసీ నాయకులు

నారాయణఖేడ్, జూలై 7: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం వీఆర్వోల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. 121 జీవోను రద్దు చేసి గత వీఆర్వోలను సీనియారిటీ ప్రాతిపదికన రెవెన్యూ శాఖలో పునర్నియామకం చేయాలని కోరారు. 5,700 మంది వీఆర్వోలకు ఉద్యోగ భద్రత, సర్వీసు, పదోన్నతులకు నష్టం జరగకుండా తిరిగి రెవెన్యూ శాఖలో కొనసాగించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు అశోక్, అంజన్న, సత్యనారాయణ, శణ్ముఖం, గోరక్‌రావు, ఈశ్వర్, సంపత్‌రెడ్డి, సునీల్, రాములు, విష్ణు, ఖాదర్ మగ్దుమ్ ఉన్నారు.

# నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**


మాజీ ఎంపీటీసీ పద్మమ్మను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, నాయకులు

పుల్కల్, జూలై 7: ప్రజలకు సేవ చేసేందుకు పదవితో పనిలేదని నిత్యం ప్రజల మధ్యే ఉండాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట శివారులో పెద్దారెడ్డిపేట, రాయిపహడ్, మంతూర్ గ్రామాలకు సంబంధించి పుల్లయ్యగారి పద్మమ్మ ఎంపీటీసీగా బాధ్యతలు చేపట్టి ఇటీవల పదవీ కాలం ముగియడంతో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన క్రాంతికిరణ్ మాట్లాడుతూ ఐదేండ్లు ప్రజల మధ్యే ఉంటూ నిత్యం సేవలందించారన్నారు. వయసుతో సంబంధం లేకుండా గ్రామానికి ఎంతో సేవ చేశారని పద్మమ్మను అభినందించారు. పదవి లేదనే భావన కలుగకుండా ఎ ప్పటికీ ప్రజల్లోనే ఉంటూ సహాయసహకారాలు అందించాలన్నారు. అనంతరం ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు సైతం పద్మమ్మను సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తలారి అంజయ్య, అనంతం, సుభాష్, విష్ణయ్య, రాజు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తాం

పటాన్‌చెరు, జూలై 7: మైత్రి మైదానంలో సమస్యలు పరిష్కరిస్తామని పటాన్‌చెరు మున్సిపల్ డివిజన్ 113 కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరులోని మైత్రి క్రీడా మైదానాన్ని సందర్శించారు. వర్షాకాలం మైదానంలో నీరు నిలువ ఉండకుండా చర్యలు తీ సుకుంటామని తెలిపారు. మరమ్మతులు చేయించి క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్లయ్య పాల్గొన్నారు.


మైత్రి మైదానాన్ని పరిశీలిస్తున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

## వివాహిత ఆత్మహత్య

అమీన్‌పూర్, జూలై 7: భర్తతో విడాకుల కారణంగా మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పీజేఆర్ కాలనీ మాధవపురి హిల్స్‌లో నివాసం ఉండే పంతటి రీనా(30)కు మూడేండ్ల క్రితం మేడిశెట్టి సాయితో వివాహం జరిగింది. సంవత్సరం తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి విడాకులు తీసుకున్నారు. అప్పటినుంచి తల్లిదండ్రుల వద్ద ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఈ క్రమంలో ఎప్పుడూ విడాకులైన ఘటనను తలుచుకుంటూ జీవితంపై విరక్తి చెంది నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, జూలై 7: గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 166 ప్రభుత్వ భూమిలో రెండు ఎకరాల్లో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి నిర్మించిన పలు కట్టడాలను ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ ఆదివారం జేసీబీతో కూల్చివేయించారు.



## వైభవంగా ఆషాఢ బోనాలు



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఆదివారం బోనమెత్తారు. మొదటి వారం సంగారెడ్డిలో రేణుక ఎల్లమ్మకు మహిళలు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

*- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి*

# నాగులపల్లిలో సీసీ రోడ్డు పనులు షురూ


సీసీ రోడ్డు పనులపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ శంషాబాద్ రాజు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రామచంద్రాపురం, జూలై 7: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలోని 14వ వార్డులో రోడ్లు మెరుగుపడుతున్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కారణంగా రోడ్లన్నీ గుంతలమయం కావడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రెండు నెలలుగా వాహనదారులు నానా తంటాలు పడ్డారు. ఈ నేపథ్యంలో 'రోడ్లపై అడ్డగోలు తవ్వకాలు' శీర్షికతో నమస్తేతెలంగాణ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్ 14వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆదివారం 14వ వార్డులోని మెయిన్‌రోడ్డు లైన్‌ని విస్తరించి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ శంషాబాద్ రాజు రోడ్డు పనులను పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, డ్రైనేజీ పైప్‌లైన్ల పనులు పూర్తికావడంతో సీసీ రోడ్డు వేయిస్తున్నామన్నారు. సీసీ రోడ్డు పనుల్లో ఎలాంటి నాణ్యతాలోపం లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దశలవారీగా గుంతలమయమైన రోడ్లను బాగుచేసి ప్రజల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 7: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సర ప్రవేశాలు ఈ నెల 8 నుంచి ప్రారంభమవుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. తారా ప్రభుత్వ కళాశాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి దోస్త్ మూడో ఫేస్‌లో అడ్మిషన్ వచ్చిన విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్నప్పుడే వారి సీటు ఉంటుందని స్పష్టం చేశారు. దోస్త్ మూడో ఫేస్‌లో అడ్మిషన్ వచ్చిన విద్యార్థులు తప్పనిసరిగా 11వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ మొదటి, రెండు, మూడో ఫేస్‌లలో తారా కళాశాలలో సీటు వచ్చి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్న విద్యార్థులు సీసీ ఓటీపీ వచ్చిన తర్వాత ఈ నెల 8 నుంచి 12వ తేదీలోగా కళాశాలలో ఫిజికల్ రిపోర్ట్ చేయాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు టీసీ, నాలుతో తరగతి నుంచి ఇంటర్ వరకు బోనాఫైడ్లు, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని కళాశాలలో అడ్మిషన్ పొందాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా విద్యార్థులు 99899 42298, 7989239115 నంబర్లపై సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు తారా ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ పొంది కళాశాలలో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


జహీరాబాద్‌లో జెండా ఆవిష్కరించిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

కోహీర్, జూలై 7: మాదిగలకు ఉద్యోగాల్లో సముచిత న్యాయం కల్పించేందుకు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జహీరాబాద్, చింతల్‌ఘాట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అబ్రహం మాదిగ, ప్రేందాస్, రాంచందర్, సుధీర్‌కుమార్, పద్మారావు, జయరాజ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయానికి విరాళాలు

జిన్నారం, జూలై 7: మండల కేంద్రం జిన్నారంలో నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి ఆదివారం భక్తులు విరాళాలు అందించారు. ఊట్ల గ్రామ మాజీ సర్పంచ్ జింకల శివరాజ్ రూ.51వేలు, మాజీ వైస్ ఎంపీపీ గంగురమేశ్ రూ.25వేలు, ఊట్ల మాజీ సర్పంచ్ కొరివి ఆంజనేయులు రూ.21వేలు, సోలక్‌పల్లి శ్రీరామ ఫెర్టిలైజర్ యజమాని శ్రీనివాస్‌రెడ్డి రూ.11వేలు, సోలక్‌పల్లికి చెందిన ప్రభాకర్‌రెడ్డి రూ.10,116, అన్నారానికి చెందిన మద్ది ప్రతాప్‌రెడ్డి రూ.5 వేల ఇటుకలు, సోలక్‌పల్లి గ్రామానికి చెందిన చెక్క శ్రీకాంత్‌గౌడ్ 2 వేల ఇటుకలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల రక్షణ పట్టదా?

- రక్షణ జాగ్రత్తలు తీసుకోకుండా విధులు
- గ్లౌజులు లేక ప్లాస్టిక్ కవర్లతో పనులు
- మున్సిపల్ కార్మికుల గోడును పట్టించుకోని అధికారులు


జోగిపేటలో చేతులకు గ్లౌజులు లేకుండానే పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

అందోల్, జూలై 7: అందోల్–జోగిపేట మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా రోజువారి పనులకు హాజరవుతన్నారు. అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పిండం లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని ప్రజలు. మున్సిపాలిటీలో 42 మంది సిబ్బంది పనిచేస్తుండగా తాత్కలిక పద్ధతిలో 38 మంది, పర్మినెంట్ ఉద్యోగులు నలుగురు, వాటర్ సప్లై విభాగంలో 12 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే వీరికి పనిచేసే సమయంలో ఉపయోగించేందుకు బూట్లు, బట్టలు, గ్లౌజులు, సబ్బులు ఇతరత్రా వస్తువులు అందజేస్తారు మున్సిపల్ అధికారు. వీటిని వాడుతూ కార్మికులు విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇక్కడి మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండానే విధులకు హాజరవుతూ రోజువారి పనులు నిర్వహిస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు**

మున్సిపల్ కార్మికులు చేతులకు కనీసం గ్లౌజులు కూడా తొడగడంలేదు. ప్లాస్టిక్ కవర్లను చేతులకు తొడిగి విధులు నిర్వహిస్తున్నారు. కార్మికులకు అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదా? లేదంటే సిబ్బందే వాటిని వాడకుండా నిర్లక్షంగా విధులకు హాజరవుతున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. కనీస జాగ్రత్తలు పాటించకుండా విధులకు హాజరైతే వారి ఆరోగ్యాలు ఏమవుతాయి. సంబంధిత శాఖ అధికారులు పనులు నిర్వహించే సమయంలో పర్యవేక్షిస్తున్నారా, లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు క్రమం తప్పకుండా కార్మికులకు అవసరమైన సామగ్రిని అందజేస్తామని తెలిపారు. గత నెలలోనే బట్టలు, బూట్లు, గ్లౌజులు, సబ్బులు....ఇతరత్రా వస్తువులు అందజేశామన్నారు. వాటిని వాడకుండా విధులు నిర్వహిస్తున్న వారిపై దృష్టి పెడుతామన్నారు. పనులు చేపట్టే సమయంలో సిబ్బంది కనీస జాగ్రత్తలు తీసుకునేలా వారిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు.